Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

# *'Entamatramuna Evvaru dalachina' Annamayya Saptagiri Sankirtanalu*

*K. SUBRAHMANYAM*
*Research Scholar*
*Department of Performing Arts*
*S.V. University, Tirupati*
*E-mail: ksm.libra999@gmail.com*

**Abstract**

*Tallapaka Annamayya - a supreme devotee, a saint composer, a lyrical poet. He composed and sang 32000 sankirtanas in the praise of Lord Sri Venkateswara. He was born in Tallapaka village, Rajampet Taluk, Cuddapah district of Andhra Pradesh in 1408. He, not only had attained the realm of salvation, but saw to it that his whole family continued the legacy of total devotion and dedication. The Tirumala Tirupati Devastanams (TTD) is putting great effort to propagate Annamacharya sankirtans. In 1949 TTD started the death anniversary commemorative celebrations of Annamacharya and in 1978, started the birth anniversary celebrations. The TTD way back in mid 90's was convinced that selected numbers from Annamayya Sankirtanas shall be included in the list of songs performed at various concerts commemorating Annamayya like Tyagaraja Aradhanotsavam. The then executive officer instructed to this effect in writing to the then Annamacharya project director Dr. Medasani Mohan. A committee formed with experts and selected specialized and categorized seven sankirtanas. The seven sankirtans have been compiled in to the form of a book by Sri G. Balakrishnaprasad with notation. From then onwards it has become customary include these songs into all celebrative concerts in the name of Tallapaka Annamayya*

*Keywords : Saptagiri Sankirtanas, Tallapaka, Salvation, Aradhanotsavam*

**'ఎంతమాత్రమున ఎవ్వరుదలచిన'**

**అన్నమయ్య సప్తగిరి సంకీర్తనలు**

**పరిచయం**

తెలుగు సాహిత్య చరిత్రలో క్రీ.శ. 15వ శతాబ్దానికి ఒక విశిష్ట స్థానముంది. పద్యవిద్యతో పాటు గేయ విద్య కూడా అనేక పోకడలతో నవీనతను సంతరించుకుంది. పద్యం పండిత సమ్మతమై సభా మర్యాదను పొంద డంచేత గేయం అణగద్రొక్కబడింది. అలాంటి దశలో గేయ కవితకు జానపద రీతులను జోడించి అనిబద్ధ మైన వాటిని నిబద్ధం చేసి 'పదకవిత' అనే నూతన ప్రక్రియను ప్రవేశపెట్టి పదకవితా పితామహుడిగా ఖ్యాతి గడించాడు - తాళ్లపాక అన్నమయ్య. కేవలం పండిత వర్గానికి మాత్రమే పరిమితమైన సంక్లిష్టమైన ప్రబంధ యుగం నడుస్తున్న తరుణంలో సాహిత్యపు గతిని ఒక్కసారిగా మార్చివేసి చిన్న చిన్న పదాలతో తేటతెల్లంగా అందరికీ అర్థమ య్యేలా సంకీర్తనలను రచించి తెలుగు సాహితీ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన మహా వాగ్గేయకారుడు. ప్రబంధాలు సామాన్య ప్రజలకు చేరువకావు అన్న విషయాన్ని 600 ఏళ్ల కు పూర్వమే అన్నమయ్య ముందు చూపుతో ఊహించాడు. అందుకే సులభమైన సంకీర్తనా విధానాన్ని ఎన్నుకున్నాడు.

శ్లో॥ సంగీత మపి సాహిత్యం సరస్వత్యా: స్తనద్వయమ్
ఏకం ఆపాత మధురం అన్యథాలోచనామృతమ్ ॥

ఆపాతమధురమైన సంగీతాన్ని ఆలోచనామృతమైన సాహిత్యంతో రంగరించి శరణాగతి మార్గంలో శ్రీవేంకటే శ్వర స్వామి వారిని 32వేల సంకీర్తనలతో అర్చించి తరించిన భక్తాగ్రేసరుడు.

**జీవిత విశేషాలు**

అన్నమయ్య (మే 9, 1408 - ఫిబ్రవరి 23, 1503) తాళ్లపాక గ్రామంలో నందవరీక వంశంలో వైకుంఠ నాథుని నందకాంశ సంభూతునిగా జన్మించాడు. నారాయణసూరి, లక్కమాంబ తల్లిదండ్రులు. 16వ యేట అహోబిలం శఠగోపయతి వద్ద శిష్యరికం ద్వారా ఆగమశాస్త్రాది అధ్యయనం పూర్తి చేశాడు.

వైష్ణవ మతాన్ని స్వీకరించి వైష్ణవ సిద్ధాంతాన్ని తన రచనల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసాడు. తిరుమల క్షేత్రం చేరి శ్రీ వేంకటేశ్వరునిపై పద రచనకు పూనుకున్నాడు. అలాగే పద్మావతి అమ్మవారితో పాటు రాముడు, కృష్ణుడు, హనుమంతుడు, నరసింహస్వామి ఇతర దేవతామూర్తులపై సంకీర్తనలు రచించాడు. తిమ్మక్క, అక్కలమ్మలను వివాహం చేసుకున్నాడు తన చుట్టూ వున్న పరిస్థితులను, సమస్యల ను ప్రస్తావిస్తూ ఆయా సమస్యలకు తగిన పరిష్కారాలను కూడా సూచించిన అభ్యుదయవాది, సమాజాని కి ఇబ్బంది కలిగించే కొన్ని రకాల కట్టుబాట్లను ఆచారాలను నిరసిస్తూ. వాటిని తన రచనల ద్వారా రూపు మాపాలని పోరాటం చేసిన సాహితీ విప్లవకారుడు. అన్నమయ్య తరువాతి తరం వారైన పెదతిరుమలాచా ర్యుడు, చిన తిరుమాలాచార్యుడు, చిన్నన్న ఎన్నో రచనలు చేశారు. తెలుగు సాహిత్య చరిత్రలో తాళ్లపాక కవుల రచనలు ప్రత్యేక అధ్యాయంగా నిలిచిపోయాయి.

## సప్తగిరి సంకీర్తనల ఎంపిక - కార్యాచరణ

త్యాగయ్య ఆరాధనోత్సవాల తరహాలోనే అన్నమాచార్యుల వారి ఆరాధనోత్సవాలకు ప్రత్యేకత సంతరిం చాలనే దృఢ సంకల్పం నుంచి సప్తగిరి సంకీర్తనల గోష్టి గానం అనే ఆలోచన అంకురించింది. అన్నమయ్య సంకీర్తనలలో బహుళ ప్రచారం పొందిన ఏడు సంకీర్తనలసమాహారమే ఈ సప్తగిరి సంకీర్తనలు.

మొట్టమొదటి సారిగా 1949లో అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానము లు అత్యంత వైభవంగా నిర్వహించింది. అది మొదలు అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలను టిటిడితో పాటు ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నాయి. అదే క్రమంలో జయంతి ఉత్సవాలను కూడా జరుపు కుంటున్నారు.

అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో సుమారు14 వేల సంకీర్తనలు మాత్రమే వివిధ రూపా ల్లో మనకు లభ్యమయ్యాయి. వాటిని ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలని ఏర్పరిచి 29 సంపుటాలుగా 1980లో తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రచురించి వాటిని ఆడియో, సిడిల రూపంలో రికార్డింగ్ ప్రాజెక్టు ద్వారా కళాకారులందరిచేత పాడించి విస్తృతమైన ప్రచారంలోకి తీసుకొచ్చారు.

అన్నమయ్య తరువాత వచ్చిన వాగ్గేయకారులు, సంగీత త్రిమూర్తులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి ఆరాధనోత్సవాల్లో వారి రచనల్లోని ప్రత్యేకంగా కొన్నింటిని మాత్రమే తీసుకుని కళాకారులు పాడటం, ప్రత్యేకించి తిరువయ్యారులో త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవం జరుగుతున్నప్పుడు ఘనరాగ పంచరత్న కృతులను పాడటం ఆ కార్యక్రమాన్ని చూసిన అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానముల

శ్రీకార్యనిర్వాహణాధికారిగా వున్న శ్రీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గారికి వెంటనే ఆలోచన వచ్చింది. అన్నమయ్య ఆరాధనోత్సవాల్లో కూడా ప్రత్యేకం గా ఎంపిక చేసిన సంకీర్తనలను గోష్టి గానం నిర్వహించాలని 1995లో సంకల్పించారు.

అన్నమయ్య సంకీర్తనల కచేరీలో కళాకారులు వాళ్లకు నచ్చిన, ప్రజలు మెచ్చిన సంకీర్తనలను పాడుతూ వచ్చారు. అయితే ద్వాదశి, జయంతి, వర్ధంతి ఉత్సవాల్లో ఏ సంకీర్తనలు పాడాలి, ఎన్ని పాడాలి, వాటి నిడివి ఎలా నిర్ణయించాలనే విషయం అప్పటి అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డా॥ మేడసాని మోహన్ గారికి అప్పజెప్పారు. ఆయన మద్రాసు మ్యూజిక్ అకాడమీ వారిని సంప్రదించి భారతరత్న, విదూషీమణి డా॥ ఎం.ఎస్. సుబ్బు లక్ష్మి గారి ఆధ్వర్యంలో ఈ సంకీర్తనల ఎంపిక ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు మొట్టమొదటి నిలయ  విద్వాంసులు, టిటిడి ఆస్థాన విద్వాంసులు శ్రీ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గారి పాత్ర ఇందులో చాలా కీలకమైంది. అప్పటి మేటి సంగీత విద్వాంసులందరితో చర్చించి ఈ సప్తగిరి సంకీర్తనలను ఎంపిక చేశారు. ఎందుకంటే  అప్పటికే ప్రముఖ సంగీత విద్వాంసులందరూ అన్నమయ్య సంకీర్తనలను వారి వారి శైలిలో స్వరపరచి ప్రచారంలోకి తీసుకువచ్చారు. అందరి బాణీలను ప్రజలు ఆదరిస్తున్నారు. ఎవరు స్వరపరిచింది తీసుకోవాలి, లేదా ప్రజా బాహూళ్యంలో విశేషంగా ప్రచారంలో వున్న వాటిని తీసుకోవాలా? లేదా కొత్తగా ఏవైనా స్వరపరచి వాటిని అందరికీ నేర్పించి గోష్టిగానంగా పాడించాలా? ఇన్ని రకాల ప్రశ్నలు వచ్చాయి? అప్పటికే బాలాజీ పంచరత్నాలని  ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారు కొన్ని సంకీర్తనలను గానం చేసి ఆడియోగా తీసుకొచ్చారు మరి పంచరత్నాలని 5 ఎంపిక చేయాలా, లేదా నవరత్నాలని 9 సంకీర్తనలు ఎంపిక చేయాలా, ద్వాదశ సంకీర్తనలని 12 ఎంపిక చేయాలా అనే మరో ప్రశ్న. 5 సంకీర్తనలైతే మరీ తక్కువ సమయం పడుతుంది. తొమ్మిదంటే మరీ ఎక్కువ, ఇంక 12 అంటే చాలా సమయం తీసుకుంటుంది కనుక మధ్యేమార్గంగా 7 సంకీర్తనలు చాలు అని నిర్ణయానికి వచ్చారు. ఏడు కొండల వాడు కాబట్టి సప్తగిరి సంకీర్తనలే తగిందని నిర్ధారించారు. అలాగే  ప్రసిద్ధ విద్వాంసులు స్వరపరచి ప్రచారంలో వున్నవాటిని ఎంపిక చేయాలని ఆమోదించారు.

1. సంకీర్తనలు స్వరపరచిన మొదటి విద్వాంసులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ కాబట్టి ఆయన స్వరం చేసినది ఒకటి తీసుకోవాలి. అప్పటికే ఆయన చేసిన చక్కనితల్లికి ఛాంగుభళా, బ్రహ్మకడిగిన పాదము, అలరులు  కురియగ ప్రసిద్ధంలో వున్నాయి. అలరులు కురియగ కచేరీ శైలిలో, నాట్య ప్రదర్శనకు ఉపయోగకరంగ వుంటుంది కాని గోష్టిగానంలో అంతగా బాగుండదని బ్రహ్మకడిగిన పాదము ఎంపిక చేశారు.

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

2. తరువాత ప్రసిద్ధంగా వున్న విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు కాబట్టి ఆయన స్వర పరచిన సంకీర్తనల్లో ప్రచారంలో వున్న బేహాగ్ రాగంలో స్వరపరచిన నారాయణతే నమోనమో ఎంపిక చేశారు.

3. నేదునూరి కృష్ణమూర్తి గారు స్వరపరచిన భావములోన బాహ్యమునందున ఎం.ఎస్. సుబ్బులక్ష్మి గారు ఆలపించి ప్రచారంలో వున్నందున ఆ సంకీర్తనను ఎన్నుకున్నారు.

4. డి. పశుపతి గారు స్వరపరచిన కొన్ని సంకీర్తనలు బాగా ప్రచారంలో వున్నాయి కాబట్టి ఆయన స్వరం చేసిన  కొన్ని సంకీర్తనలను బాలకృష్ణప్రసాద్ గారు పాడి వినిపిస్తే అందులో జనసామాన్యంలోకి వెళ్లిన మోహన రాగంలోని పొడగంటి మయ్య ఎంపిక చేశారు.

5. ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ స్వరం చేసిన హిందోళరాగంలో వున్న 'కొండలలో నెలకొన్న' ఎంపికైంది.

6. అందరూ తెలుగు వాళ్లే అయితే ఎలా అని ఆలోచించి తమిళంలో ప్రముఖ విద్వాంసుడు ఎన్నో సంకీర్తన లను  స్వరపరచిన కడయనల్లూరు వెంకటరామన్‌ని పరిగణనలోకి తీసుకున్నారు. ఎందుకంటే ఆయన స్వరం చేసిన  22 సంకీర్తనలను ఎం.ఎస్. సుబ్బులక్ష్మి అప్పటికే ఆడియో రూపంలో ప్రచారంలోకి తీసుకొచ్చారు. 'దీనుడనేను'  అనే సావేరి రాగంలో వున్న సంకీర్తన ఎంపిక చేశారు. అది శాస్త్రీయ సంగీత కచేరీకి అనువుగా వుంటుందే తప్ప గోష్టిగానానికి తగింది కాదని చివరికి రాగమాలికలో ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అనే సంకీర్తనను ఖరారు చేశారు. సప్తగిరి సంకీర్తనల్లో రాగమాలిక పెట్టొచ్చా వద్దా అని మళ్లీ మరో చర్చ జరిగి అందరికీ ఆమోదయోగ్యంగా సులభమైన రాగాలు బృందావని, మాయామాళవగౌళ రాగాల్లో మిశ్రచాపు తాళంలో శాస్త్రీయ పోకడలతో వున్న  అంశంగా వుంది కాబట్టి ఫరవాలేదని 'ఎంతమాత్ర మున ఎవ్వరు తలచిన' ఎంపిక చేసారు. అన్నీ ఆదితాళంలోనే వున్నాయి కాబట్టి  తాళం మార్పుతో అనువైన అంశంగా ఆమోదించారు.

7. ఆరు ఎంపిక చేసిన తరువాత ఏడవది ఎవరు స్వరం చేసిన సంకీర్తన తీసుకోవాలి అని చర్చ జరిగిన తరువాత మహా విద్వాంసులు డా॥ నూకల చిన సత్యనారాయణ, ఎక్కువ సంఖ్యలో స్వర పరచిన గరిమెళ్ల  బాల కృష్ణప్రసాద్ గారు చేసినది తీసుకోవాలని ఆమోదించారు. అయితే బాలకృష్ణప్రసాద్ గారు అంగీక రించకపోవడంతో మళ్లీ ఎంపికైన ఈ ఆరుగురు విద్వాంసులు చేసిన సంకీర్తనల నుంచే ఎంపిక చేయాల ని తేల్చారు. అందరిలోకి నేదునూరు గారు చేసిన సంకీర్తనలు ప్రజల్లోకి వెళ్లిపోయాయి కనుక నేదునూరి గారిదే రెండో సంకీర్తన తప్పకుండా పెట్టాలని ఆయన స్వరం చేసిన ఒకపరికొకపరి వయ్యారమై శాస్త్రీయ పోకడలతో వుంది కనుక అది కాకుండా రక్తిగా వుండి జనసామాన్యాన్ని దృష్టిలో వుంచుకుని సులభంగా

పండిత పామరుల కు అందరికీ నచ్చిన 'ముద్దు గారే యశోద' ఎంపిక చేసారు. రాగ, తాళ, సాహిత్య విలు వలు ఆధారంగా వాటి క్రమ పద్ధతిలో ఏర్పరిచారు.

**ప్రచారం** - బాలకృష్ణప్రసాద్ ద్వారా ఈ సంకీర్తనలకు నొటేషన్‌లను (స్వరలిపి) సేకరించి టిటిడి చిన్న పుస్తక రూపంలో తీసుకొచ్చింది. ఇప్పటికే కొన్ని లక్షల కాపీలను ముద్రించి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి మద్రాసు మ్యూజిక్ అకాడమీతో పాటు దేశవ్యాప్తంగా వున్న ప్రసిద్ధమైన అన్ని యూనివర్శిటీలు, సంగీత సభలు, సంస్థల్లో ప్రాజెక్టు నిలయ విద్వాంసులుగా వున్న బాలకృష్ణప్రసాద్, నాగేశ్వరనాయుడు, పారుపల్లిరంగనాథ్, వేదవ్యాస ఆనందభట్టర్ ద్వారా స్థానికంగా వున్న కళాకారులకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఈరోజు ప్రతి ఒక్కరూ ఈ సంకీర్తనలు పాడుకునేలా బృహత్తర ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.

| సంఖ్య | సంకీర్తన ప్రారంభం | రాగం | తాళం | సంగీతం సమకూర్చిన వారు |
|---|---|---|---|---|
| 1. | భావములోన | శుద్ధధన్యాసి | ఆది | శ్రీ నేదునూరి కృష్ణమూర్తి |
| 2. | బ్రహ్మకడిగిన పాదము | ముఖారి | ఆది | శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ |
| 3. | ఎంతమాత్రమున | రాగమాలిక | మిశ్రచాపు | శ్రీ కడయనల్లూరు వెంకటరామన్ |
| 4. | పొడగంటిమయ్య | మోహన | ఆది | శ్రీ డి. పశుపతి |
| 5. | కొండలలో | హిందోళం | ఆది | శ్రీ ఎం. ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ |
| 6. | నారాయణతే | బేహాగ్ | ఆది | శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ |
| 7. | ముద్దుగారే యశోద | కురంజి | ఆది | శ్రీ నేదునూరి కృష్ణమూర్తి |

**1వ సంకీర్తన**

పల్లవి॥ భావములోన బాహ్యము నందును
గోవింద గోవింద యని కొలువవో మనసా ॥ భావములోన ॥

చరణం ॥ హరియవతారములే అఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరి నామములే అన్ని మంత్రములు
హరి హరి హరి హరి హరి యనవో మనసా ॥ భావములోన ॥

చరణం ॥ విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడెడి వేదంబులు
విష్ణుడొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణువు విష్ణువని వెదకవో మనసా ॥ భావములోని ॥

చరణం ॥ అచ్యుతుడితడే ఆదియు నంత్యము
అచ్యుతుడే అసురాంతకుడు
అచ్యుతుడు శ్రీ వేంకటాద్రి మీద నిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥ భావములోన ॥

సంపుటం - 3 - 561

**2వ సంకీర్తన**

పల్లవి॥ బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము ॥ బ్రహ్మ కడిగిన ॥

చరణము॥ చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలితల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము ॥ బ్రహ్మ కడిగిన ॥

చరణము॥ కామిని పాదము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము ॥ బ్రహ్మ కడిగిన ॥

చరణము॥ పరమ యోగులకు పరిపరి విధము
పరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము ॥ బ్రహ్మ కడిగిన ॥

సంపుటం - 1 - సంకీర్తన - 191

**3వ సంకీర్తన**

పల్లవి॥ ఎంతమాత్రమున ఎవ్వరు దలచిన అంత మాత్రమే నీవు
అంతరాంతము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు ॥ ఎంత ॥

చరణము॥ కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలతురు మిము శైవులు తగిన భక్తులును శివుడనుచు
అలరి పొగడుదురు కాపాలికులాది భైరవుండనుచు ॥ ఎంత ॥

చరణము॥ సరి నెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలపుల కొలదుల భజింతురు
సిరుల మిము నే యల్పబుద్ధి దలచిన వారికి అల్పంబవుదువు
గరిమల మిము నే ఘనమని దలచిన ఘన బుద్ధులకు ఘనుడవు
నీవలన కొరతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే ఊరినయట్లు
శ్రీవేంకటపతి నీవైతే మము చేకొని వున్న దైవమని
ఈవల నే నీ శరణననెదను ఇదియే పర తత్వము నాకు ॥ ఎంత ॥

సంపుటం- 2- సంకీర్తన - 393

**4వ సంకీర్తన**

పల్లవి॥ పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా మమ్ము
నెడయకవయ్య కోనేటిరాయడా ॥ పొడగంటి ॥

చరణం॥ కోరి మమ్ము నేలినట్టి కులదైవమా ! చాలా
నేరిచి పెద్దలిచ్చిన నిధానమా
గారవించి దప్పిదీర్చు కాలమేఘమా ! మాకు
చేరువ చిత్తములోని శ్రీనివాసుడా ॥ పొడగంటి ॥

చరణం॥ భావింపకైవసమైన పారిజాతమా ! మమ్ము
చేవదేర గాచినట్టి చింతామణీ
కావించి కోకలిచ్చే కామధేనువా ! మమ్ము
తావై రక్షించేటి ధరణీధరా ! ॥ పొడగంటి ॥

చరణం॥ చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా! రోగా-
లణచి రక్షించే దివ్యౌషధమా !
బడిబాయక తిరిగే ప్రాణబంధుడా ! మమ్ము
గడియించినట్టి శ్రీ వేంకటనాథుడా ॥ పొడగంటి ॥

అన్నమాచార్య జీవిత చరిత్ర - ద్విపద - పీఠిక పుట 22

**5వ సంకీర్తన**

పల్లవి॥ కొండలలో నెలకొన్న కోనేటి రాయడు వాడు
కొండలంత వరములు గుప్పెడువాడు

చరణం॥ కుమ్మర దాసుడైన కురువరత్తినంబి
ఇమ్మన్న వరములెల్ల ఇచ్చినవాడు
దొమ్ములు చేసినయట్టి తొండమాన్ జక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మిన వాడు ॥ కొండలలో ॥

చరణం॥ అచ్చపు వేడుకతో అనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమల నంబి తోడుత
ఇచ్చినిచ్చ మాటలాడి నచ్చిన వాడు ॥ కొండలలో ॥

చరణం॥ కంచిలోన నుండ తిరుక్కచ్చి నంబి మీద కరు
ణించి తన యెడకు రప్పించిన వాడు
ఎంచనెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ పాలించినవాడు ॥ కొండలలో ॥

సంపుటం -1 - సంకీర్తన -151

**6వ సంకీర్తన**

| | | |
|---|---|---|
| పల్లవి॥ | నారాయణతే నమో నమో | |
| | నారద సన్నుత నమో నమో | ॥ నారాయణ ॥ |
| చరణం॥ | మురహర భవహర ముకుంద మాధవ | |
| | గరుడగమన పంకజనాభ | |
| | పరమ పురుష భవబంధ విమోచన | |
| | నరమృగ శరీర నమో నమో | ॥ నారాయణ ॥ |
| చరణం॥ | జలధిశయన రవిచంద్ర విలోచన | |
| | జలరుహభవనుత చరణయుగ | |
| | బలిబంధన గోపవధూ వల్లభ | |
| | నలినోదరతే నమో నమో | ॥ నారాయణ ॥ |
| చరణం॥ | ఆదిదేవ సకలాగమ పూజిత | |
| | యాదవకుల మోహన రూప | |
| | వేదోద్ధర తిరువేంకట నాయక | |
| | నాదప్రియతే నమో నమో | ॥ నారాయణ ॥ |

సంపుటం - 11 - భాగం -2 - సంకీర్తన - 32

**7వ సంకీర్తన**

| | | |
|---|---|---|
| పల్లవి॥ | ముద్దుగారే యశోద ముంగిట ముత్తెము వీడు | |
| | తిద్దరాని మహిమల దేవకీ సుతుడు | ॥ ముద్దుగారే ॥ |
| చరణం॥ | అంతనింత గొల్లెతల అరచేతి మాణికము | |
| | పంతమాడే కంసుని పాలి వజ్రము | |
| | కాంతుల మూడు లోకాల గరుడ పచ్చపూస | |
| | చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు | ॥ ముద్దుగారే ॥ |

చరణం॥ రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖుచక్రాల సందుల వైఢూర్యము
గతియై మమ్ము గాచే కమలాక్షుడు ॥ ముద్దుగారే ॥

చరణం॥ కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీ వేంకటాద్రి ఇంద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ పద్మనాభుడు ॥ ముద్దుగారే ॥

సంపుటం - 3 - సంకీర్తన - 577

**ఎంతమాత్రమున - రాగమాలిక (బృందావని, మాయామాళవగౌళ) - మిశ్రచాపు తాళం**

**సంకీర్తన విశేషాలు**

**పల్లవి (బృందావని రాగం)**

; నీ నీ సాం , సం సాం సాం ‖ సాం ని రిం రీం నీ పామా పా‖

. ఎంత మా త్ర ము న ‖ ఎ . వ్వ రు ద ల చి న ‖

;, ప సంని ప మ రీ మా ప ని ‖ మ ప నీ నీ సాం ; సంని రింసం‖

; , అం . త మా . . త్ర మే . ‖ . . నీ . వు . . . . . ‖

నీ , ప ని ని నీ , ని నీ నీ ‖ ప ని సం ని ప మ రీ మా పా పా‖

. . అం . త రాం . త ర ము ‖ లెం . . . చి . . చూ . డ ‖

రి మ రి రి ప మ మ ని ప పా ని మ పా ‖ నీ , నీ, సాం; ; ; ;‖ సం రిం

పిం . . డం . . తే . . ని ష్ప . టి ‖ య . న్న . ట్లు . . . . ‖ . .

**॥ ఎంత మాత్రమున ॥**

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

**చరణం (బృందావని రాగం)**

మ ప ప  ప  ప  ప  మ ప ని ప  <u>మప</u> మ రి స ‖ స ని఼ రి స ని఼ ని఼ పా఼ నీ఼ స  స సా ‖

కొ లు తు రు మి ము వై . ష్ణ వు లు .  .  .  . ‖కూ . రి మితో .  .  వి ష్ణు డ ని ‖

ని఼ స రి మ  <u>మాపమ</u> రి  స  రీ మ ప ప ప ‖ ప నీ ప మ రీ  ప మ పా,;‖

ప లు కు దు రు . .  మి ము వే దాం తు లు‖ ప ర  బ్ర . హ్మం బనుచు . . ‖

ని ని ని ని ని ని     పని ని నీ ప ప మ‖ పా ని ని <u>సా̇రి̇స̇</u>నిప  ని ని  స̇ స̇ సా̇‖

త ల తు రు మి ము శై . వులు త గి న ‖ భ క్తు లు ను . . . . .  శి వు డ నుచు‖

ని స̇ రి̇ స̇ రి̇ రి̇ రి̇ రి̇ ప̇ మ̇ మ̇ రి̇ రి̇ స̇ ‖ని స̇ రి̇ <u>నిని</u> ని ప మ ప ని ని  సా̇  ; ‖ స̇ రి̇

అ ల రి పొగడుదురు కా .  పా  .  లి కు ‖లా . ది  భై . .  ర వుం .  డ ను చు . ‖ .  .

**॥ ఎంత మాత్రమున ॥**

**చరణం (మాయామాళవగౌళ)**

స రి గా గ గ గ మా మా మ మా ‖ గా మ గా రి స ని఼ స రి గా రి రి ‖

స రి నె న్ను దు రు శా క్తే యు లు ‖ శ క్తి రూ పు నీ . వ ను చు ద రి ‖

రి రి  రి   రి  రి  రి   గా మా గ రి  స రి ‖ద ద ప మ గ మ గ రి స  నీ఼   రి  స ని఼ ‖

శ న ము లు మి ము నా నా  వి ధు ల ను‖త ల పు ల కొ ల దు ల భ జిం తు రు సి ‖

ని఼ ని఼  ని఼  ని఼    ని఼ ధ఼ సా స సా స స రి‖ గ మ గా రి స నీ఼ నీ఼  స రి  స  స  ‖

రు ల మి ము  నే  .  అ ల్ప బుద్ధి త ల ‖ చి న వా రి కి అ ల్పం బ వు దు వు ‖

గ రి గ  మ మ మ మా గ మ ప  ద ప మ‖ గ రి  ద ద  పా మ గ రి గ మ ద పా ‖

గ రి మ ల మి ము  నే  ఘ న మ ని ద ల ‖ చి న ఘ న బు ద్ధులకు  ఘ ను డ వు‖

దా ద ద ప ద ద దా దా ద  ద ద ‖పా ద ప ప మ గ మ ప ద పా ప ద‖

నీ వ ల న కొ ర తే లే దు మ రి ‖నీ రు కొ ల ది తా . మె ర వు ఆ . ‖

ని ని ద ని నీ ని ని స̇ రి̇ స̇ ని స̇ స̇ ‖రి̇ స̇ ని ద ప ద నీ ని ని సా̇ సా̇ ‖

వ ల భా . గీ ర థి ద రి బా . వు ల ‖ఆ . జ ల మే . పూ రి న య ట్లు ‖

1) స̇ రి̇ గా̇ గ̇ గ̇ గ̇ గ మా̇ గ̇ రి̇ సా̇ ‖స̇ ని రీ̇ రి̇ రి̇ రి̇ స̇ రి̇ గా̇ గ̇ గ̇ గ̇‖

శ్రీ . వేం క ట ప తి నీ వై . తే ‖మ ము చే కొ ని వు . న్న దై వ మ ని‖

2) మా̇ మా̇ మ̇ మ̇ మ̇ మ̇ <u>గ̇మ̇ప̇మ̇</u> గ̇ రి̇ సా̇ ‖ స̇ ని రీ̇ రి̇ రి̇ రి̇ స̇ రి̇ గా̇ గ̇ గ̇ గ̇‖

శ్రీ వేం క ట ప తి నీ . . . వై . తే ‖మ ము చే కొ ని వు . న్న దై వ మ ని‖

మా̇ గ̇ రి̇ సా̇ సా̇ ని ద ప మ గ రి ‖ స రి̇ గా గ మ పా ద ద నీ సా ‖

ఈ వ ల నే నీ శ ర ణ నె ద ను‖ ఇ ది యే ప ర త త్త్వ ము నా కు ‖ **(3 సార్లు పాడి ఆపవలెను)**

**విశేషాంశములు**

శాస్త్రీయ సంగీత పోకడలతో రాగమాలికగా మిశ్రచాపులో వున్న ఈ సంకీర్తనలోని సాహిత్యం కూడా ఎంతో విశేషమైనది. శైవం, వైష్ణవం, శాక్తం, గాణాపత్యం, సౌరం, స్కాందం ఆరు మతాల (షణ్మతాలు) గురించి చెబుతూ ఎవరు ఏ మతాన్ని అవలంభించినా అవన్నీ కూడా శ్రీవేంకటేశ్వరుని సాక్షాత్కర సాధనంగానే అన్నమయ్య పేర్కొంటాడు. చిత్తూరు జిల్లాలో మాత్రమే వినిపించే మాండలిక శబ్దం 'నిప్పటి' అనే పదం ద్వారా భగవంతునిపై మనకున్న భక్తిని అన్వయిస్తాడు. నిప్పటి అంటే అరిసె, కజ్జాలు, నూనె బొప్పట్లు అని తెలుగునాట మాండలిక శబ్దం వినియోగంలో వుంది. అలాగే నీరు కొలది తామెరవు అనే మరో జాతీయాన్ని సందర్భోచితంగా ప్రస్తావించాడు. భక్తి ప్రధాన మాధ్యమంగా భగవంతుని సాక్షాత్కారానికి ఉపకరిస్తుందనే విషయాన్ని తన పదరచన ద్వారా స్పష్టీకరించాడు. భావన స్వరూపం ఏదైనా భగవంతుని తత్వం ఏకీకృతమైనదనే విషయాన్ని చెప్పాడు. మనం ఎంత మేర భావిస్తామో భగవంతుని కృప కూడా అంత మేరకే లభిస్తుందని, చేసే కర్మను బట్టి ఫలితం వుంటుందని తనదైన శైలిలో పేర్కొన్నాడు అన్నమయ్య. పరిపుష్టమైన

సంగీత సాహిత్య విలువలతో మిగిలిన ఆరు సంకీర్తనలు కూడా దేనికదే ప్రత్యేకమైన శైలిలో శ్రీవేంకటేశ్వ రుడు కొలువైన సప్తగిరుల్లా ప్రకాశిస్తున్నాయి.

## ముగింపు

సప్తగిరి సంకీర్తనలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా గోష్టిగానంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వీటిని క్రమ పద్ధతిలో పాడుకునే అవకాశం వుంది. అలాగే పండితులచేత అర్థ తాత్పర్యాలను రాయించి, ఆయా సంకీర్తనల్లోని సాహిత్య విశేషాలకు అనుకూలంగా చిత్రాలను గీయించి ఆకర్షణీయంగా వుండేలా అందమైన పుస్తకాన్ని ప్రసాద రూపంలో అందరికీ అందుబాటులోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుంది.

## ఉపయుక్త గ్రంథసూచి

1. సప్తగిరి సంకీర్తనలు తాళ్లపాక అన్నమాచార్య విరచితములు తి. తి, దేవస్థానములు, తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు

2. తాళ్లపాక సాహిత్యము ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు సంపుటములు, తి.తి. దేవస్థానములు 1984.

3. సుప్రసిద్ధ వాగ్గేయకారులు, డా॥ శ్రీమతి ద్వారం లక్ష్మి, 1999

4. అన్నమయ్య పదకోశం, తి. తి. దేవస్థానములు, 2012

5. టిటిడి ఆస్థాన విద్వాంసులు శ్రీ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గారి ద్వారా సేకరించిన ప్రాథమిక సమాచారం.